ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

మంగళవారం | నవంబరు 03, 2026 | సంపుటి : 7 | సంచిక : 128 | పేజీలు : 2





- బీజేపీ సర్కారు రావాలా.. వద్దా?
- ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి
- నకిలీ ఓట్లు తొలగించాలా.. వద్దా?:
- కాంగ్రెస్‌ది ఓటు బచావో ర్యాలీ కాదు.. చొరబాటుదారులను కాపాడే ర్యాలీ
- వాళ్లు ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వం
- హైదరాబాద్ బీజేపీ మహాపాదయాత్ర

తెలంగాణలో కాంగ్రెస్‌ను గద్దె దించాలి

బీజేపీ శ్రేణులకు కేంద్ర మంత్రి అమిత్ షా పిలుపు

హైదరాబాద్, ఆయుధం: తెలంగాణలో కాంగ్రెస్ సర్కారును గద్దె దించేందుకు సంకల్పం తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్‌షా బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ సర్కారు రావాలా... వద్దా? అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని.. అరాచకత్వాన్ని అంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో భాజపా మహాపాదయాత్ర సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడారు. అప్పట్లో నిజాం మెడలను సర్దార్ వల్లభాయ్ పటేల్ వంచబట్టే హైదరాబాద్ విముక్తి పొందిందన్నారు.

కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ఓటు బచావో ర్యాలీలపై అమిత్ షా విమర్శలు గుప్పించారు.''కాంగ్రెస్‌ది ఓటు బచావో ర్యాలీ కాదు.. చొరబాటుదారులను కాపాడే ర్యాలీ. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఎంత ప్రయత్నించినా చొరబాటుదారులకు ఓటు దక్కనివ్వం. చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా..వద్దా? ఓటరు జాబితాను ప్రక్షాళన చేయాలా.. వద్దా? కోటికి పైగా ఉన్న నకిలీ ఓట్లు తొలగించాలా..వద్దా? దేశంలో లేని వారి ఓట్లే 3 కోట్లకు పైగా ఉన్నాయి. ఈ చొరబాటుదారుల ఓట్లు తొలగించాలా.. వద్దా? ఎస్ఐఆర్ వల్ల మేము గెలిచామని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. 2014, 2019 ఎన్నికలప్పుడు ఎస్ఐఆర్ లేదు.. అప్పుడు మోదీ గెలపలేదా?ఈవీఎంలు ట్యాంపరింగ్ జరిగితే రేవంత్ రెడ్డి ఎలా ముఖ్యమంత్రి అయ్యారు. కొన్నేళ్లుగా భాజపాకి దేశంలో ఆదరణ పెరుగుతోంది'' అని అమిత్ షా అన్నారు.

10 ఏళ్ల లో రూ.12 లక్షల కోట్ల అవినీతి

ఇండియా కూటమి నిర్వహించిన మాక్ పార్లమెంట్‌పైనా అమిత్ షా విమర్శలు గుప్పించారు. '' ఎస్ఐఆర్, ఈవీఎంపై చర్చకు సిద్ధమని హైదరాబాద్ నుంచి సవాల్ విసురుతున్నా. ఈవీఎంల ద్వారా మేము గెలిస్తే..తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచింది. కేరళ, తమిళనాడులో భాజపాయేతర ప్రభుత్వాలు ఎలా ఏర్పడ్డాయి? కాంగ్రెస్ పార్టీని దేశమంతా ఛీకొడుతోంది. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ.12 లక్షల కోట్ల అవినీతి జరిగింది. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్‌పై ఉంది. ఇలాంటి పార్టీ మోదీతో పోటీపడుతుందా? ఆయనతో పరుగుపందెంలో పాల్గొనగలదా? కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల అవినీతి రాజ్యమేలుతోంది.

డ్రగ్స్ రహిత దేశంగా భారత్

తెలంగాణను కాంగ్రెస్ పార్టీ (మిగతా 2లో..)


భవిష్యత్‌లో సమస్యలు తలెత్తకుండా

బైలా సవరణలు

- గతంలో చేసిన సవరణలకు చట్టబద్ధత లేదు
- కమిటీ నివేదిక ఆధారంగా ముందుకెళతాం
- గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు

హనుమకొండ, ఆయుధం:

భవిష్యత్ లో క్లబ్ వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకే ప్రస్తుత కమిటీ కృషి చేస్తోందని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బైలాకు సవరణలు చేసేందుకు వేసిన కమిటీకి బాధ్యతలు అప్పగించి.. ఈనెల 25 వ తేదీలోగా నివేదికను అందించాలని కోరినట్లు తెలిపారు. 1991 సంవత్సరంలో ఏర్పాటైన క్లబ్ బైలాకు ఇప్పటివరకు చేసిన సవరణలు రిజిస్టర్ కాకపోవటంతో వాటికి చట్టబద్ధత లేకుండా పోయిందన్నారు. ఇక ముందు క్లబ్ కార్యకలాపాలు ఏ పాలక వర్గం వచ్చినా తు.చ తప్పకుండా పాటించేలా చట్టబద్ధంగా ఉండేలా సమగ్ర పరిశీలన చేసి నివేదికను ఈనెల 25 లోగా అందించాలని వారిని కోరినట్లు తెలిపారు. అందుకు వారు సమ్మతిని తెలియజేశారని... ఆ నివేదిక ఆధారంగా జనరల్ బాడీ నిర్వహించి బైలా సవరణలకు చట్టబద్ధత తీసుకువచ్చిన వెంటనే... సభ్యత్వాలు, స్క్రూటినీ పూర్తిచేసి ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. బైలాకు సవరణలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేసి జనరల్ బాడీ సమావేశంలో సభ్యుల ఆమోదం చేసుకుని మూడు నెలల్లో (జనవరి 2027) ఎన్నికల ప్రక్రియను పూర్తిచేసే విధంగా ముందుకు వెళతామని వెల్లడించారు. భవిష్యత్ లో క్లబ్ వ్యవహారాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు చేపడుతున్న మంచి ప్రయత్నానికి సభ్యులందరూ సహకరించాలని.. ఇంకా ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా మమల్ని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు ఆ ప్రకటనలో కోరారు.



ఎస్ఐఆర్ నిబంధనల ప్రకారం

పారదర్శకంగా పూర్తి చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి
- ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి
- ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి
- రికార్డులు, ఆధారాలను పక్కాగా నిర్వహించాలి
- నవంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సిద్ధం కావాలి

హనుమకొండ, ఆయుధం: తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్ 2026) ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ 2026 ప్రక్రియ పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలు, తుది ఓటర్ల జాబితా ప్రచురణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. (మిగతా 2లో..)

ప్రతీ నీటి బొట్టు సద్వినియోగం కావాలి

- తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు
- లీకేజ్ లను అరికట్టాలి
- స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలి
- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ, ఆయుధం: జిల్లాలో ఎక్కడ కూడా రానున్న రోజుల్లో దాహార్తి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. ఎల్ నినో ప్రభావ పరిస్థితులను ఎదురుకునేందుకు వివిధ శాఖల అధికారులు చేపట్టాలిసిన చర్యల మీద సోమవారం కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఇరిగేషన్ అధికారులు జిల్లా లో ఉన్న ట్యాంక్ లలో ఉన్న నీటి సామర్థ్య వివరాలను తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదు కావడం, భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉన్నందున..రానున్న రోజుల్లో ప్రతి నివాస ప్రాంతానికి సరిపడేలా రక్షిత మంచినీరు సరఫరా అయ్యే విధంగా అధికారులు ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. తాగునీటి సరఫరా తీరుతెన్నులను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా ప్రతీ గ్రామ పంచాయతీ లో, వార్డ్ లలో పర్యవేక్షించాలన్నారు. నీటి వృధాకు ఆస్కారం లేకుండా, అందుబాటులో ఉన్న నీటి వనరులు పూర్తిస్థాయిలో సద్వినియోగం అయ్యేలా గ్రామ,మండల, జిల్లా అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. వాటార్ సప్లై అవుతున్న సమయం లో లీకేజ్ లు ఏమైనా ఉన్నాయా అని గుర్తించాలన్నారు. ప్రతీ నెల మీటింగ్ పెట్టుకొని ఎల్ నీనో వల్ల ఏర్పడే సమస్య ల పైన కార్యాచరణ రూపొందించుకొని వాటిని ఎదుర్కొనేందుకు క్షేత్ర స్థాయి లో తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నీటి బొట్టు సద్వినియోగం అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పైప్ లైన్ లలో , కార్ వాష్ సర్వీస్ లలో తదితర ప్రాంతాలలో నీటి వృధా ను అరికట్టాలన్నారు.అనంతరం ఎంపీడీఓ లను ఉద్దేశిస్తూ కలెక్టర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల కు సంబంధించి వచ్చిన అప్లికేషన్ లను క్షేత్ర స్థాయి లో త్వరగా వెరిఫికేషన్ పూర్తి అవ్వాలన్నారు. వీబీజీ రామ్ జీ లో భాగం గా గ్రామీణ ప్రాంతాల్లోని అర్హులైన జాబ్ కార్డ్ దారులు అందరికీ విధిగా ఉపాధి కల్పించాలని, కూలీలు ఎక్కువ సంఖ్యలో పనులకు వచ్చేలా ఎంపీడీఓ లు (టర్నోవర్ పెరిగేలా) పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, స్థానిక సంస్థల ఇంచార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, డీఎంహెచ్‌వో, ఎంపీడీఓ లు పాల్గొన్నారు.



కాంగ్రెస్ వైఫల్యాలపై యువత

పోరాటాలకు సిద్ధం కావాలి

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేసింది

వరంగల్, ఆయుధం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై యువత పోరాటాలకు సిద్ధం కావాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో సోమవారం ధర్మారం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, బీజేవైఎం జిల్లా ప్రభారీ జలగం రంజిత్ రావు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. ఏ దేశానికైనా యువతనే వెన్నెముక అని, దేశ భవిష్యత్తు యువశక్తిపైనే ఆధారపడి ఉందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో యువతకు పెద్దపీట వేస్తుంటే, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం యువతను, నిరుద్యోగులను నిలువునా వంచిస్తోందని మండిపడ్డారు. సమాజంలో మార్పు తీసుకురాగల శక్తి ఒక్క యువతకే ఉందని, బీజేపీ ఎల్లప్పుడూ యువత ప్రోత్సాహానికి, వారి రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటునందిస్తుందని గంట రవికుమార్ అన్నారు. ఎన్నికల ముందు విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సీఎం రేవంత్ రెడ్డి నెరవేర్చలేదని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని, యువతను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, విద్యార్థుల, నిరుద్యోగుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్యవైఖరిని బీజేవైఎం శ్రేణులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రజాపోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని స్పష్టం చేశారు. విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, ఉద్యోగ నోటిఫికేషన్ల సాధన కోసం బీజేపీ యువమోర్చా ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు యువత అంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యవర్గ సమావేశంలో పలు విద్యా, ఉద్యోగ సమస్యలపై ధర్నాలు చేపట్టే విధంగా తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎలగందుల శ్రవణ్, రాపాక ప్రశాంత్, జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శులు అచ్చ దయాకర్, అడెపు రవిరాం, బీజేవైఎం పదాధికారులు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



బల్దియా గ్రీవెన్స్‌లో

116 వినతులు

- ఫిర్యాదులను పరిష్కరించండి: కమిషనర్

వరంగల్, ఆయుధం: గ్రీవెన్స్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదుల సంబంధ దరఖాస్తులను స్వీకరించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావానికి అనుగుణంగా ఆయా విభాగాలకు బదలాయించారు. గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని, జాప్యాన్ని సహించేది లేదని అధికారులకు సూచించారు. నిర్దేశిత (మిగతా 2లో..)



నేటి నుంచి తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్

వరంగల్, ఆయుధం: 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ -2026(క్లస్టర్ డి) వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు, హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం, కిట్స్ కళాశాల, భీమారం ఎస్వీఎస్ కళాశాలల్లో నిర్వహించబడుతున్నదని, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1535 మంది పోలీసు క్రీడాకారులు పాల్గొననున్నారు.

నిర్ణీత ధరలకే బియ్యం

విక్రయించాలి

- నిబంధనలకు విరుద్ధంగా బియ్యం విక్రయిస్తే చర్యలు
- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి షా ఫైజల్ హుస్సేని

ములుగు, ఆయుధం: జిల్లాలో వ్యాపారులు నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి షా ఫైజల్ హుస్సేని ఒక ప్రకటనలో తెలిపారు. రైస్‌మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు బియ్యం ధరల పట్టికను వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బస్తా విక్రయించే బియ్యానికి కిలోకు గరిష్ఠ రిటైల్ ధరలు బీపీటీ/కేఎన్ఎం రకానికి రూ.66, ఆర్ఎన్ఆర్/తెలంగాణ సోనాకు రూ.74, హెచ్ఎంటీ/జేఎస్ఆర్ రకానికి రూ.79గా పేర్కొన్నారు. ఆయా రకాల బియ్యాన్ని నిర్ణయించిన ధరలకు మించి విక్రయించరాదని స్పష్టం చేశారు. వినియోగదారుల నుంచి అధికంగా వసూలు చేయడం, తూకంలో తేడాలు చూపడం, నాణ్యతకు విరుద్ధంగా బియ్యం విక్రయించడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి కొనుగోలుకు వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లు అందించాలని వ్యాపారులకు సూచించారు. వినియోగదారులు బియ్యం కొనుగోలు సమయంలో ధర, తూకం, నాణ్యతను పరిశీలించి బిల్లు తీసుకోవాలని కోరారు. అధిక ధరలకు విక్రయించినా, ఇతర అక్రమాలను గుర్తించినా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

నూతన సమీకృత గ్రావెల్ విధానం అమలు

- అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ పర్మిషన్ పోర్టల్
- గ్రావెల్ అనుమతుల కోసం సులభతరమైన ఆన్‌లైన్ విధానం ప్రారంభం
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి





పార్కు స్థలాన్ని కాపాడండి

- 18వ డివిజన్ లేబర్ కాలనీ–క్రిస్టియన్ కాలనీ అఖిలపక్ష నాయకుల డిమాండ్

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరంలోని హుస్సేన్ కాలనీ పరిధిలో గల లేఅవుట్ సర్వే నంబర్ 388లోని సుమారు 18 గుంటల పార్కు స్థలాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థపై ఉందని 18వ డివిజన్ లేబర్ కాలనీ-క్రిస్టియన్ కాలనీ అఖిలపక్ష నాయకుల బృందం డిమాండ్ చేసింది. పార్కు స్థలాన్ని ఆనుకొని ఉన్న కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి, అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. ఈ పార్కు స్థలం బహిరంగ మార్కెట్లో సుమారు రూ.5 కోట్ల విలువ ఉంటుందని తెలిపారు. ప్రజల అవసరాల కోసం వినియోగించాల్సిన పార్కు స్థలం కబ్జాకు గురవుతుండటంతో గత సోమవారం గ్రీవెన్స్‌లో నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అనంతరం అసిస్టెంట్ సిటీ ప్లానర్‌తో పాటు బల్దియా అధికారులు పార్కు స్థలాన్ని పరిశీలించి, ఏడీ సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఈరోజు మరోసారి గ్రీవెన్స్‌లో కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పార్కు స్థలాన్ని వెంటనే ADసర్వే చేయించి, స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి, పార్కు స్థలంగా సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష నాయకులు కోరారు. పార్కు స్థలాన్ని కాపాడి భవిష్యత్తులో ప్రజల అవసరాలకు, భావితరాల ప్రయోజనాలకు వినియోగించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్, హెరాల్డ్, దేవునూరి రాజు, గడ్డమీది రాజేష్, మార్టిన్ లూథర్, పోలేపాక ప్రశాంత్, బొడ్డు రాకేష్, జి. ప్రవీణ్, మనోహర్, జగదీశ్వర్, కొల్లూరి సుమిత్ ,యేసు, శ్రీనివాస్, లెమ్యూల్, చిన్ని సుధాకర్, కరుణాకర్, ఈసంపల్లి ప్రభాకర్, మేఘ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ పారదర్శకంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)

కాన్ఫరెన్స్ లో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్.రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏఎస్‌డీ (అబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) జాబితాలోని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని, సరైన విచారణ లేకుండా ఏ ఒక్క అర్హులైన ఓటరు పేరు తొలగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. డిలీషన్ జాబితాలో ఉన్న ప్రతి ఓటరు వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని, పేరు తొలగించడానికి గల కారణాలు, అందుకు సంబంధించిన ఆధారాలను తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. ఓటరు నుంచి వచ్చిన అభ్యంతరాలు, వివరణలు, సమర్పించిన పత్రాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఫారం6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు వచ్చిన దరఖాస్తులు, ఫారం7 ద్వారా వచ్చిన అభ్యంతరాలు, ఓటరు పేరు తొలగింపునకు సంబంధించిన అభ్యర్థనలు, ఫారం8 ద్వారా వచ్చిన చిరునామా మార్పులు, ఓటరు వివరాల సవరణలు తదితర దరఖాస్తుల పరిష్కార స్థితిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేసి తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఓటర్ల జాబితాలో పేరు చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి అధికారులు తీసుకునే ప్రతి నిర్ణయానికి స్పష్టమైన కారణాలు తెలియజేస్తూ స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని సూచించారు. ప్రతి కేసుకు సంబంధించిన నోటీసులు, నోటీసుల అందజేత వివరాలు, విచారణ నివేదికలు, ఓటర్లు సమర్పించిన ఆధారాలు, సంబంధిత పత్రాలను క్రమపద్ధతిలో భద్రపరచాలని తెలిపారు. భవిష్యత్తులో ఏవైనా అభ్యంతరాలు వచ్చినప్పుడు సంబంధిత రికార్డులు అందుబాటులో ఉండేలా పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు.

నోటీసులు జారీ చేసిన ప్రతి ఓటరుకు నిబంధనల ప్రకారం స్పందించేందుకు, తమ వాదనలు వినిపించేందుకు తగిన అవకాశం కల్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయి విచారణను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి దశలో తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఏఎస్‌డీ జాబితా, డిలీషన్ జాబితా, ఫారం6, 7, 8 దరఖాస్తుల పరిష్కార పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. తుది ఓటర్ల జాబితా ప్రచురణకు ముందు అన్ని వివరాలను మరోసారి పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ 2026 ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో, నవంబర్ 26, 2026వ తేదీలోగా నోటీసుల జారీ, విచారణలు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 30, 2026వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించాల్సి ఉన్నందున, ఈ గడువులను దృష్టిలో ఉంచుకొని అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఆర్డీవో /ఈఆర్వో వెంకటేష్, హనుమకొండ తహసీల్దార్/ ఏఈఆర్ఓ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ, ఆయుధం: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణి అనేది ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని, దీనిపట్ల ఏ అధికారి కూడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉండకుండా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ఈనాటి ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 232 అర్జీలు అందాయి. ఇందులో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో 116 అర్జీలు అందగా, ఆర్డీవో కార్యాలయాల్లో 21, ఎంపీడీవో కార్యాలయాల్లో 95 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నూతన సమీకృత గ్రావెల్ విధానం అమలు

- అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ పర్మిషన్ పోర్టల్
- గ్రావెల్ అనుమతుల కోసం సులభతరమైన ఆన్‌లైన్ విధానం ప్రారంభం
- మూడు నుంచి ఐదు రోజుల్లో అనుమతులు మంజూరు
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం పోర్టల్ ను లాంఛనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టర్



హనుమకొండ, ఆయుధం: అక్రమ మైనింగ్ కు అడ్డుకట్ట వేయడంతో పాటు మట్టి (గ్రావెల్) తవ్వకాలకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానంను అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో నూతనంగా పోర్టల్ ను తీసుకువచ్చినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో నూతనంగా అమల్లోకి తీసుకువచ్చిన సమీకృత గ్రావెల్ (మట్టి) నిర్వహణ విధానం (ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం) పోర్టల్ ను జిల్లా కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సమీకృత గ్రావెల్ నిర్వహణ విధానం అమలు గురించిన వివరాలను అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ....ఈ విధానం ద్వారా పౌరులు తమ మొబైల్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా సులభంగా లాగిన్ అయి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. దరఖాస్తులు సంబంధిత అధికారులకు చేరతాయని, రెవెన్యూ భూములకు సంబంధించిన అనుమతులను పరిశీలించి మూడు నుంచి ఐదు రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సమన్వయంతో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించిన అంశాలుంటే ఆ శాఖ లాగిన్‌కు కూడా దరఖాస్తును పంపించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు సమయంలో ఎక్కువ వివరాలు అడగకుండా ప్రాథమికంగా ఆధార్, తదితర వివరాలతో పాటు గ్రావెల్ ఎక్కడి నుంచి తీసుకోవాలనుకుంటున్నారనే వివరాలను మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.

సొంత పట్టా భూమి నుంచి గ్రావెల్ తీసుకోవాలనుకుంటే పట్టాదారు పాస్‌బుక్ కాపీని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇతరుల పట్టా భూమి నుంచి తీసుకోవాలనుకుంటే సంబంధిత భూయజమాని నుండి సమ్మతి పత్రాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో సర్వే నంబర్, జియో కోఆర్డినేట్స్ తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తుల పరిశీలన కోసం రెవెన్యూ శాఖకు మూడు పేజీల చెక్‌లిస్ట్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. మట్టి (సిల్ట్) కోసం దరఖాస్తు చేసుకున్న సందర్భాల్లో రెవెన్యూ శాఖకు, దానిని నీటిపారుదల శాఖకు ఫార్వర్డ్ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిపారుదల శాఖ రెండు రోజుల్లో పరిశీలించి తిరిగి రెవెన్యూ శాఖకు పంపిస్తుందన్నారు. రెవెన్యూ శాఖ ఎన్ఓసీ ఇచ్చిన అనంతరం, పరిమాణం ఎక్కువగా ఉన్నట్లయితే మైనింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సి ఉంటుందన్నారు. పరిమాణం తక్కువగా ఉంటే జిల్లా లాగిన్‌కు వచ్చిన అనంతరం నేరుగా అనుమతులు జారీ చేస్తారని వివరించారు. అనుమతి మంజూరైన తర్వాత పూర్తి వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్ జనరేట్ అవుతుందన్నారు. ఎంత పరిమాణంలో గ్రావెల్‌కు అనుమతి ఇచ్చారు, ఏ ప్రాంతం నుంచి తీసుకెళ్లాలి, ఏ లొకేషన్‌కు అనుమతి ఇచ్చారు, ఏ సమయానికి అనుమతి ఉంది అనే వివరాలు అందులో స్పష్టంగా ఉంటాయన్నారు. అలాగే అనుమతించిన ట్రాక్టర్లు, ఇతర వాహనాల నంబర్లు కూడా నమోదు అవుతాయని, అనుమతి పొందిన వాహనాల ద్వారా మాత్రమే గ్రావెల్ (మట్టి) తరలించాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియలో గ్రామ పంచాయతీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. అనుమతించిన ట్రిప్పుల సంఖ్య, వాస్తవంగా తరలించిన ట్రిప్పుల సంఖ్యను పర్యవేక్షించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోర్టల్ వినియోగంపై రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కూడా అందించినట్లు వెల్లడించారు. ఈ పోర్టల్ నుండి మట్టి (గ్రావెల్) అనుమతుల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత రుసుము గ్రామ పంచాయతీలకు వెళ్తుందని తెలిపారు. ఈ విధానంలో గ్రామ పంచాయతీలకు కూడా ప్రోత్సాహకం ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ పోర్టల్ ఇసుకకు సంబంధించినది కాదని, (మట్టి)గ్రావెల్ మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇసుక కోసం ఇప్పటికే ప్రత్యేక పోర్టల్ ఉందని తెలిపారు. జిల్లాలో నూతనంగా తీసుకువచ్చిన ఈ విధానం ద్వారా ఇసుక అనుమతులు జారీ చేయడం జరగదని తెలిపారు. ఇప్పటికే గనుల శాఖ వద్ద ఒక పోర్టల్ ఉన్నప్పటికీ, అది ప్రధానంగా ప్రభుత్వ పనులకు సంబంధించిన పెద్ద మొత్తంలో మైనింగ్ అనుమతుల కోసం మాత్రమే ఉపయోగపడుతోందన్నారు.

అనంతరం ఇంటిగ్రేటెడ్ గ్రావెల్ మేనేజ్మెంట్ సిస్టం (ఐజి ఎం ఎస్) పోర్టల్ కు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డిఆర్ఓ శ్రీనివాస్, మైనింగ్ శాఖ ఏడి రామాచారి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, జి డబ్ల్యూ ఎం సి కాజీపేట డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్, సి సెక్షన్ సూపరింటెండెంట్ చల్లా ప్రసాద్,సీజీజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాధాకృష్ణ, ఈడీఎం శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.

నరకాసుర వధకు ఏర్పాట్లు చేయాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న
- వివిధ శాఖల అధికారులకు ఏర్పాట్లపై దిశానిర్దేశం
- విధి నిర్వహణలో వాకీటాకీల వినియోగం తప్పనిసరి



వరంగల్, ఆయుధం: దీపావళి సందర్భంగా ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమైన కమిషనర్ మాట్లాడుతూ, కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, లైటింగ్, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఏర్పాట్లన్నింటినీ కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షించాలని ఆదేశించారు. అదేవిధంగా, విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన వాకీటాకీలను తప్పనిసరిగా వినియోగించాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు ఇచ్చే సూచనలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా సమన్వయంతో విధులు నిర్వహించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ముఖ్య ఉద్యానవన అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, కార్యదర్శి అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కౌశల్ యోజన జిల్లా కన్వీనర్ గా శ్రీరామోజు మోహనాచారి నియామకం



వరంగల్, ఆయుధం: వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీ విశ్వకర్మ కౌశల్ యోజన జిల్లా కన్వీనర్ గా శ్రీరామోజు మోనాచారి నియామకమయ్యారు. ఈ సందర్భంగా సోమవారం వరంగల్ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గంట రవి కుమార్, వన్నాల వెంకటరమణ, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, బాకం హరి శంకర్, మండల అధ్యక్షుడు తాళ్లపల్లి అర్జున్ మిట్టపల్లి కపిల్, భక్తి రంజిత్, ఆరె కార్తీక్, బోయిన రాజు, దూడ పరమేష్, దారబోయిన అనిల్, రాజేష్, దుబ్యాల అశోక్, ఆవునూరు వంశీ, మానుపాటి రాజు, తదితరులు మోహన చారి ఎన్నిక పట్ల శుభాకాంక్షలు తెలిపారు.



టీటీడీకి స్పెసిఫైడ్ అథారిటీ నియామకం

తిరుపతి, ఆయుధం: టీటీడీ ట్రస్టు బోర్డు పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం 'స్పెసిఫైడ్ అథారిటీ'ని నియమించింది. ఈ మేరకు జీవో నం. 658 విడుదల చేసింది. తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర ఛైర్మన్‌గా.. ఆర్థికశాఖ కార్యదర్శి వి. వినయ్ చంద్, దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు సభ్యులుగా అథారిటీని ఏర్పాటు చేసింది. నూతన ట్రస్ట్ బోర్డు ఏర్పాటయ్యే వరకు లేదా ఏడాది పాటు ఈ స్పెసిఫైడ్ అథారిటీ కొనసాగనుంది. తితిదే ధర్మకర్తల మండలికి ఉండే అన్ని అధికారాలూ దీనికి ఉంటాయి.

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి



నంగునూర్, ఆయుధం: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కును నంగునూరు మండలానికి చెందిన లబ్ధిదారు కొండిల ప్రవంతి భర్త వెంకటేష్‌కు ఏఎంసీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పేద, నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేని కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి లబ్ధిదారుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్స్ ఎండీ ఇమ్రాన్, జీవన్ నాయక్, పిడిచెట్టు ప్రభాకర్, పీఏసీఎస్ డైరెక్టర్ కరెడ్ల వెంకట్ రెడ్డి, గడ్డం కరుణాకర్ రెడ్డి, శ్యామ్ రెడ్డి, లింగంపల్లి అజయ్, చిర్రం భాను, ప్రశాంత్, శంకరయ్య, పాల్గొన్నారు.

శంభులింగేశ్వర స్వామి ఆలయంలో చంద్రబోస్ పూజలు

వరంగల్, ఆయుధం:

వరంగల్ గిర్మాజీపేట రామవారి వీధిలోని శ్రీభవాని సహిత శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రముఖ పాటల రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ కుటుంబ సభ్యులతో దేవాలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు, చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భవాని సహిత శంభులింగేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ తరఫున వారికి వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతా భావంగా చిరు సత్కారం చేశారు. ఆలయ అధ్యక్షులు రామచంధర్ రావు, ప్రధాన కార్యదర్శి రామా రాజేంద్రప్రసాద్, ఆలయ సభ్యులు ప్రధాన అర్చకులు గుండేటి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌ను గద్దెదించాలి

(మొదటి పేజీ తరువాయి..)

ఏటీఎంగా రేవంత్‌రెడ్డి మార్చారు. ఇక్కడ రాహుల్, రేవంత్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఇక్కడి ఆర్ఆర్ ట్యాక్స్ ఎక్కడికి వెళ్తోంది? రాహుల్ కోసమే ఇక్కడ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ అవినీతిని ఒవైసీ ఆపుతారా.. బీఆర్ఎస్ ఆపుతుందా? కాంగ్రెస్ అవినీతిని కేవలం భాజపా మాత్రమే ఆపగలదు. త్వరలో నేనే భారత్‌ను డ్రగ్స్ రహిత దేశంగా మారుస్తాం. మాటిమాటికీ విదేశాలకు పారిపోయేవారు మనకు కావాలా? మేం ఎప్పుడూ పేదలు, రైతులు, యువత పక్షమే ఉంటాం. తెలంగాణలో బీజేపీ సర్కార్ వచ్చేందుకు మాకు అండగా ఉండాలి.'' అని అమిత్ షా అన్నారు.

నల్ల నర్సింహులు వర్ధంతి సభకు తరలిరావాలి



రఘునాథపల్లి, ఆయుధం: నల్ల నర్సింహులు ఆశయాలకు ఘన నివాళులర్పిస్తూ, ఆయన 33వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమాలకు పురుడు పోసిన జనగామ జిల్లా కడవెండి గ్రామానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ, కామ్రేడ్ నల్ల నర్సింహులు సాగించిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజ మార్పు కోసం ఆయన చేసిన త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. నవంబర్ 5న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న 33వ వర్ధంతి సభకు పద్మశాలీలు, చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నల్ల నర్సింహులు ఆశయాల సాధనకు ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ప్రతి పద్మశాలీ ఈ సభను తన సొంత కార్యక్రమంగా భావించి పాల్గొనాలని కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

బల్దియా ఇంచార్జి అదనపు కమిషనర్‌గా సమ్మయ్య



వరంగల్, ఆయుధం: బల్దియా ఇంచార్జి అదనపు కమిషనర్‌గా నియమితులైన సమ్మయ్య సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ టి.వెంకన్నను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కమిషనర్ జోనా పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీ నేపథ్యంలో సీనియర్ అధికారి అయిన సమ్మయ్యకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు.

బల్దియా గ్రీవెన్స్‌లో 116 వినతులు

(మొదటి పేజీ తరువాయి..)

గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం ప్రజావాణిలో స్వీకరించిన వినతుల పరిష్కార స్థితిగతులను కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ కు 51, ఇంజినీరింగ్ - 46, ఆరోగ్యం, పారిశుద్ధ్యం - 11, రెవెన్యూ -6, హార్టికల్చర్ - 1, నీటి సరఫరా 1 చొప్పున మొత్తం 116 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్,ముఖ్య హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, సెక్రటరీ అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695